దేశం ఏంకావాలి?

చక్రపాణి రెండు సంవత్సరాల తర్వాత తిరిగి యీనాడు బాహ్య ప్రపంచంలో కాలుబెట్టాడు. జైలు జీవితం అతని ఆరోగ్యాన్ని పూర్తిగా తినేసింది. బాగా పరిచయం వున్న వాళ్ళకే అతణ్ణి గుర్తుబట్టడం కష్ట మయ్యేట్టుంది.

ఆ స్టేషనులో దిగిందల్లా తానొక్కడే. స్టేషన్ మాస్టరుకు టిక్కెట్టిచ్చి, కూజాలోని కొంచం మంచినీళ్ళ డిగి పుచ్చుకొని, బల్లమీద కూచున్నాడు, — ఆకాశాన దూరంగా ఎగుర్తోన్న గ్రద్దల్ని చూస్తూ, ప్రక్క బీట్లో అరుస్తున్న ప్రత్తిరాటవు పిట్టలగోల వింటూ.

స్టేషన్ మాష్టరు తాళంవేసి, లాగిచూచి, తాళంచేతులు త్రిప్పుకుంటూ వెళ్ళిపోయాడు. ఇంకా రెండు మైళ్ళు నడిస్తేనేగాని తాను కొంప చేరలేడు. నెమ్మదిగా లేచి రైలు కట్టవెంటే బయల్దేరాడు, పాణి ఏవేవో మధుర స్వప్నాల నూహించుకుంటూ -

కొంతదూరం నడిచేసరికల్లా కాంగ్రెసు జండాలు గాలిలో రెప రెప లాడుతూ ఎదురు వస్తూ న్నాయి.

వెనక తానుపాల్గొన్న సహాయనిరాకర ణోద్యమం బుర్రలో తళుక్కుమంది. ఇలానే బయలుదేరి పికెటింగు చేస్తూ వుండేవాళ్ళు. ఒక్కసారిగా అతని కళ్ళ ముందర కల్లు దుకాణాలు, విదేశీ వస్త్రాలయాలు, కాంగ్రెసు శిబిరం, లాఠీచార్జీలు, అధికారుల వెకిలి నవ్వులు, యింకా యింకా యెన్నో - గిరున తిరిగి పోసాగినయ్.

ఆ గుంపు దగ్గరౌతున్న కొద్దీ అతని మనస్సులో కొట్లాట బయలుదేరింది. ఎంత మార్పు!

కాంగ్రెస్ ఉద్యమాన్ని ఆ గ్రామంలో కాలు బెట్టకుండా చేశాడన్న ప్రఖ్యాతితో, పన్నుగరి సంపా యించుకున్న ప్రక్కవూరి మునసబుగారు మొట్ట మొదటగా కనబడ్డాడు.

గుంపు యింకా దగ్గరైంది. "చక్రపాణికి జై" "గాంధీకి జై"అన్న నినాదాలు చెవుల్లో గింగురెత్తినయ్. పూలమాలల్తో మెడా, బిడియంతో తలా వంగిపోయి, పూలవాసనను అధిగమిస్తూ కొ్రొత్త ఖద్దరు వాసన నాసికా పుటాల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. అంతా తన వూరి వాళ్ళే. వీళ్ళంతా కాంగ్రెస్ ఉద్యమాన్ని యిలా బల పరుస్తారని తాను కలలోకూడా ఊహించ లేదు.

అసలిది నిజమా? కలా? - యిదేదో క్రొత్త

ప్రపంచంలాగావుంది. తనలాంటి క్షుద్రజీవికి-అందులోనూ స్వంత వూరివాళ్ళు స్వాగతమివ్వడం -

తనయింటిమీద కట్టుకున్న జెండానుముమ్మారు లాక్కుపోయి తగలెట్టిన రాడీ వెంకయ్యభుజాన కాంగ్రెసు జండా! ఉద్యమ ప్రభావం -

అంతా తిరిగి ఊరువేపు నడుస్తున్నారు.

"పాణిబాబూ! చాలా చిక్కిపోయావు. సర్కారోళ్లు మనదేశాన్ని పీల్చుకుతింటమే గాకుండా, నీబోటి కుర్రాళ్ల రక్తాన్నికూడా పీల్చుకు తింటున్నట్టున్నారే?"— అన్నాడు షాహుకారు నారయ్య.

క్రిందటిసారి తాను జైలుకి వెళ్లినప్పుడు యింట్లో తిండికి గింజలు లేక తన తల్లిపోయి యీ నారయ్యనే అప్పు అడిగితే-

"కొడుకు పోయాడుగా సరాజ్యం చెయ్య డానికి. వచ్చేదాకా ఉపోసాలుంటే, ఈ వార ఆవార సరాజ్యంలో ఎక్కువగా తినొచ్చుగా" అన్నాడు. ఆ నారయ్యేనా యిప్పుడు తనిని యిలా పరామర్శించడం!?

చక్రపాణి బుర్రంతా యిప్పుడు వచ్చే ఆలోచనల్తో పెద్ద రైల్వే జంక్షన్‌లాగావుంది. పూర్వ విషయాలు జ్ఞప్తికి రావడంతో కళ్లు స్వయంగా చూచిన విషయాన్నే మనస్సు ఒప్పుకోవడంలేదు.

కల్లుదుకాణం దగ్గర పికెటింగు చేస్తోంటే దౌర్జన్యంగా జండా లాగి పారేసిన గమళ్ళ సోములు -

పేదరైతుకు ఉచితంగా పొలం కొలిచి పెట్టేనందుకు కారాలు మిరియాలునూరిన ప్రైవేట్ బాపినీడు-

మాల మాదిగల నంటుకొంటున్నాడని తనని వెలిబెట్టి, బావినీళ్ళకూడా రానీక నానాబాధలు పెట్టిన పెత్తందారు -

యింకా యింకా చాలామంది - ఎంతటి పరివర్తనం !!

ఎండనక వాననక ఖద్దరుమూటలు వీపున వేసుకుని గడప గడపకూ తిరిగిన శ్రమ ఫలించిందా? తన జీవితంలో చూడలేననుకుని నిరాశ జేసుకున్న స్వాతంత్ర్యం వచ్చిందా ? అనిపిస్తోంది.

"ఇప్పుడు బహిరంగసభలో మీరు మాట్లాడాలి" అన్నాడు బాపినీడు.

"ఏం మాట్లాడాలో-" తలవంచుకుని అలానే నడుస్తున్నాడు.

ప్రక్కపొలాల్లోంచి, 'బోలో స్వతంత్ర భారత్ కు జై' 'రైతు సంఘాలకు జై' 'కూలి సంఘాలకుజై' అన్న నినాదాలు — వినిపిస్తున్నాయి.

పాణి తలెత్తి చూచాడు. "ప్రజల్లో ఏమి ఉత్సాహం? "ఈ గాడ్దెకొడుకుల్ని ప్రశ్నలిరగడం తేగాని" అన్నాడు రాడీ వెంకయ్య —

"కాంగ్రెస్‌ని వెక్కిరించడం" — అన్నాడు బాపినీడు.

"ఆళ్ళ యెర్రగుడ్డపాటి చెయ్యదు కామాలు మన జెండా"

పాణి కిదంతా అయోమయంగావుంది. ఇంతకు ముందే అతను తనలోని అనుమానాల నన్నింటినీ దిగ ద్రొక్కి విజయోత్సాహి అయ్యాడు. ఇంతలో తిరిగి।।ఇది.

"గమళ్ళ నాగులు మనుమడు కామ్రేడ్ నాగేశ్వర్రావైపోయి వూరికే పెత్తందారాయె. వెట్టి యెంకడి కొడుకుని 'అరే' అంటానికే వీల్లేదాయె. ఊళ్లో అన్ని మంచాలమీద ఆళ్లే —" అన్నాడు పెత్తందారు.

"అంకిని 'అంకమ్మా' అంటే ఇంకోసారి పిల వయ్యా అందిట. దాని తప్పేముంది?" అన్నాడు పరివేటు; తానేదో సమయోక్తి గొప్పగా వాడేశానని—

ఈ మాటల్తో పోటునీరు యథాస్థానానికి పోతున్నట్టయింది, పాణి ఉత్సాహమంతా.

"ఓరి దేవుడా! యీ ముండా కొడుకులు పారిపోతున్న కుల పిశాచాన్ని బలవంతాన కాళ్ళుగట్టి

లాక్కొస్తున్నారులాగుందే''! అనుకున్నాడు.

రైలుకట్టదిగి ఊళ్లోకొచ్చేస్తున్నారు. ఊరి బైటకే కనబడ్తోంది ఎర్రజెండా.

"అదుగో ఆ ఎగిరే ఆవిడనికాస్త త్రిప్పి రష్యాకు తోల్తేనేగాని పీడవొదల్దు'' అన్నాడు మునసబు మౌన ముద్రకు స్వస్తివాచకం చెబుతూ —

అంతా "హిహ్హిహ్హిహ్హి'' అన్నారు.

"ఔను జాతీయజండావుండగా యిది అనవసరమేమో!'' అనుకున్నాడు పాణి.

"ఐనా ఎర్రగుడ్డనుజూచి గొడ్డు బెదిరినట్టు బెదురుతారేం వీళ్లు — ''

ఊళ్లో - రోడ్డుకుడిచేతిప్రక్కగా, ఓయింటి ముందు ఎర్రజండా - చాలామంది పిల్లలు వరసల్లో నిలబడి వున్నారు. యిరవయ్యేళ్ళమ్మాయి :

"దేశమును ప్రేమించుమన్నా -
మంచియన్నది పెంచుమన్నా''

అని పాట చెబ్తూంటే పిల్లలంతా పాడుతున్నారు. శ్రావ్యంగావుంది పాట. "గురజాడ మహాపురుషుని కీర్తనకు చక్కటి స్వరూపమిచ్చారు. అడుగున పడివున్న బంగారు ముక్కల్ని త్రవ్వితీస్తున్నారు యువకులు.''

"లంజలకి పనేముంది? యిడిశేశిన రకం" అన్నాడు రాడీ వెంకయ్య.

పదిహేనేళ్ళక్రితం పికెటింగు పూర్తయిపోయి, శిబిరానికి వస్తూన్న మహిళా వలంటీర్లనుచూచి, లాంక్ షైర్ గుడ్డల్లో వెలిగిపోతోన్న బుర్రమీసాల రాయుడన్న మాటలివే – అచ్చంగా యివే మాటలు!

తిరిగి యీ నాడు పొందూరు ఖద్దర్లో మునిగి వున్న దేశభక్తుడు కాంగ్రెస్‌జండా భుజాన పెట్టుకుని మరీ అంటున్నాడు – అచ్చంగా అవే మాటలు! వేషం మాత్రం భేధం –

అప్రయత్నంగా "ఛీఛీ" అన్నాడు పాణి.

రాడీ వెంకయ్యని చాటుగా ఒక్క గిల్లు గిల్లాడు పైవేటు; నాలిక కొరుక్కుంటూ –

పాణికి ఒళ్ళంతా తేళ్లు పాకినట్టయింది. ఒక్క సారి ఆ సమూహంలో నుంచి పారిపోదామా అనుకు న్నాడు. వాళ్ళ మొహాలు చూడ్డానికే అసహ్యం వేస్తూంది. తోడేళ్ళ గుంపులో వచ్చిపడ్డ మేకపిల్లలాగ వుంది తనకి.

బహిరంగసభ – మొదటి కర్మకాండంతా ముగిసింది. చక్రపాణి మాట్లాడ్డానికి లేచి నిలబడ్డాడు. జనమంతా తనని అనుమానిస్తున్నట్టు తోచింది. ఏదో

పెద్ద తప్పుచేసినవాడిలాగా; "క్షమించండి! వందనాలు - ఊఁ - ఈ సన్మానం - నాకుకాదు - కాంగ్రెసు సంస్థకు" అన్నాడు.

"బోలో స్వతంత్ర భారత్ కుజై" అన్నారు అంతా. పాణి అలానే నిలబడి వున్నాడు.

బాపినీడు లేచి "షాహుకారు నారయ్యగారి విరాళం ఈ అయిదువందల రూపాయిలు. యిది నిర్మాణ కార్యక్రమానికి" అన్నాడు.

జనంలోనుంచి "దొంగమార్కెట్ నశించాలి!" అన్న కేకలు బయలుదేరాయి.

చక్రపాణి ప్లాట్‌ఫారం దిగి పోబోతున్నాడు. "చూడండి! చూడండి! కమ్యూనిస్టులు సభనెల్లా గల్లంతు చేస్తున్నారో" అన్నాడు మున్సబు.

"దొంగమార్కెట్ చేసేవాడు కాంగ్రెసా? పాణిగారు చెప్పాలి" అంటూ జనంలోనించి కేకవచ్చింది.

"కాదు ముమ్మాటికీకాదు" అంటూ ఒక్క-సారి దూసుకుపోయి, గుంపు కెడంగావున్న కూతుర్నీ, ముసలి తల్లినీ కలుసుకున్నాడు పాణి.

"ఎప్పుడు మీటింగు పెట్టినా యింతే" అన్నది కూతురు. తలనిలువుగా ఊపుతూ ముందుకి సాగాడు. రౌడీ వెంకయ్య రంకెలు చాలా దూరందాకా వినిపిస్తూనే వున్నాయి.

ఆరాత్రి భోజనమయ్యేలోపల – నారయ్య రూపాయికి మూడుతవ్వల బియ్యం అమ్మడమూ, కురాళ్ళంతా పట్టించడమూ, యిదంతా అర్థమయింది.

"నాన్నా ! బ్రిటిషువాళ్లు కంట్రోలు పెట్టారు కాబట్టే దానికి విరుద్ధంగా దొంగమార్కెట్ చెయ్యడం కాంగ్రెసు సిద్ధాంతమటగా !''

నవ్వి ఊరుకున్నాడు పాణి.

''ఏదెట్లాఉన్నా, ఊళ్ళోవాళ్ళంతా నాగులు మనమడి పట్టే. కాకపోతే బయటపడి కొంపలార్త య్యేమోనని గాని'' – అన్నది తల్లి.

అతని బుర్రలో పెద్ద తుపాను లేచింది. అలానే పడుకున్నాడు. తెల్లవారగట్ట ఏదో కలతనిద్ర. అందులో– జనం బారులుతీరి కూర్చున్నారు. ముందరి విస్తళ్ళనిండా అన్నం – ఒక పెద్ద భయంకర స్వరూపం– దాని వెనక ఇంకా చిన్నవి పది పదిహేను.

పెద్దపెద్దగా అంగలు వేసుకుంటూ ఆ అన్నం లాక్కొంటున్నాయి. ఒకడూ, అరా, ముద్ద నోట్లో పెట్టుకుంటే, పీకలు నొక్కి కక్కించి మరీ లాక్కుంటున్నై. లాక్కున్న అన్నం పెద్దరాసులుగా పడుతోంది. అప్పటి కప్పుడే కొన్ని రూపాయలు చేసి సంచుల కెత్తుతున్నై.

పెద్దభవనం – దానిమీద కాంగ్రెసుజండా ముందు పాణి నుంచుని వున్నాడు.

తిరిగి ఆ భయంకర స్వరూపాలే. అచ్చగా అవే గడ్డాలు పెట్టుకొని పీనుగుల్ని తొక్కుకుంటూ భవనంలోకి వస్తున్నాయి. పాణి అడ్డగించాడు. వాళ్ళ వెనకాడ్తే ఉన్నాడు. యింకో పెద్ద గడ్డాలు మీసాలు. ఆయన్ని పాణి యెరుగును. ఒకప్పుడెప్పుడో తనకు నాయకుడుగూడా అయినట్టుగుర్తు.

"వాళ్ళను పోనీ. యిప్పుడవసరం వాళ్ళతోనే!" అన్నాడు. తాను తప్పుకున్నాడు.

అవన్నీ భవనంలోకి వెళ్ళిపోతున్నాయ్. ఒకటి చీలి తనదగ్గరికి వచ్చింది. చేతులు చాచింది. తాను పారిపోబోయాడు. పట్టుకుని రెండుచేతుల్తో పైకెత్తింది. తాను గిజగిజ తన్నుకుంటున్నాడు. వదలకుండా అలానే యెత్తుకుపోతోంది.

భవనంలోవున్న తన అనుచరులందర్నీ అలానే తెస్తున్నాయి తక్కినవి. వాళ్ళూ తన్నుకుంటున్నారు.

ఒక పెద్ద యేటిగట్టు – తాను గట్టిగా కేకలు పెట్టి ఏడుస్తున్నాడు. ఊహూ – ఎత్తి గభీలున ఏట్లో పారేసింది.

తుల్లిపడిలేచాడు. ఏమీలేదు. తనయిల్లే! తన మంచమే! విపరీతమైన దడ.

''దేశం ఏంకావాలి??'' అనుకుంటున్నాడు; ఆ దడలోనే.

—